క్లుప్తంగా

ఆస్పత్రిలో చేరితే సుఖప్రసవం



గర్భిణులను తనిఖీ చేస్తున్న డాక్టర్ బి.పావని

సీతానగరం: మండలంలోని గర్భిణులంతా పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకోవడంతో పాటు కాన్పు సమయంలో ఆస్పత్రుల్లో చేరితే సుఖ ప్రసవం అవుతుందని పీహెచ్‌సీ డాక్టర్ బి పావని అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె సీతానగరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రసవ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు



మక్కువ మూడురోడ్ల కూడలివద్ద ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ శ్రీనివాసరావు

మక్కువ: మండలకేంద్రం మక్కువ మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు మక్కువ నుంచి దుగ్గేరు, శంబర, కోన, దబ్బగెడ్డ, తూరుమామిడి గ్రామాల నుంచి వెళ్లి, వస్తున్న వాహనాలను నిలిపి నిశితంగా పరిశీలించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న నవజీవన్ ఆశ్రమ నిర్వాహకురాలు చిన్నమ్మలు

సాలూరు: పట్టణంలోని నవజీవన్‌ఆశ్రమంలో అన్నలక్ష్మి స్కీం కింద బియ్యం, పప్పు, పంచదార తదితర నిత్యావసరసరుకులను పలువురు పేదలకు శుక్రవారం పంపిణీ చేశారు. నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డా.శ్రీధర్ ఆచార్య ఆర్థిక సహాయంతో ప్రతి నెలా రెండవ శుక్రవారం ఈ విధంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు సాలూరు బ్రాంచ్ మేనేజర్ చిన్నమ్మలు తెలిపారు.

డీవీఈఓను అభినంధించిన కళాశాల సిబ్బంది



డీవీఈఓ మంజులా వీణను అభినందిస్తున్న ప్రభుత్వ కళాశాల సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఒకేషనల్ విభాగంలో స్టేట్‌లో మొదటిస్థానం పార్వతీపురం మన్యం జిల్లా సాధించినందుకు మన్యం జిల్లా డీవీఈఓ మంజులా వీణకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ మేరకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పార్వతీపురం ప్రిన్సిపాల్ జె. రామారావు, సిబ్బంది తెర్లి రవికుమార్,శర్మ, సత్యనారాయణ, రవిప్రసాద్, కై లాష్, శ్రీధర్, మల్లికార్జునరావు, సునీత, సంతోషిలు డీవీఈఓకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పక్కాగా డ్రైడే



డ్రైడే కార్యక్రమ నిర్వహణపై సూచనలిస్తున్న డీఎంవో జగన్మోహనరావు

గరుగుబిల్లి: దోమల నియంత్రణే లక్ష్యంగా ప్రతీ శుక్రవారం చేపట్టే డ్రైడేను పక్కాగా పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని చినగుడబ గ్రా మంలో శుక్రవారం పర్యటించిన ఆయన డ్రైడే కార్యక్రమ అమలును పరిశీలించారు. ప్రతీ ఇంటి వద్ద ఓ చెత్తబుట్ట ఏర్పాటు చేసుకుని, అందులో చెత్త వేసి, ప్రతిరోజూ ఉదయం ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబా సిడర్‌కు అందించాలని తెలిపారు. ఇంటి ముందు, వెనక, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉన్న చోట దోమలు ఎక్కువగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టి, జ్వరాలతో బాధపడే వారిని గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు.

బాబు మాయమాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే జోగారావు
- వార్డుల్లో ఎన్నికల ప్రచారం
- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన



పార్వతీపురం టౌన్: వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబునాయుడి మాయమాటలు, బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ప్రజలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని 3, 28 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో చంద్రబాబు 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, వాటిలో ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లు నిత్యం ప్రజల మధ్యే ఉన్నామని, నియోజకవర్గంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను, వారికి పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని పరిష్కరించామని చెప్పారు. తన హయంలో నియోజవర్గం ప్రశాంతంగా ఉందని, ఎటువంటి అవినీతి కార్యక్రమాలకు పాల్పడ లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, రోగులకు వలంటీర్లు ప్రతి నెలా ఇంటి వద్దే పింఛన్లు అందించారన్నారు. అది చూసి ఓర్వలేని చంద్రబాబు తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎక్స్ వైస్‌చైర్మన్ బెలగాం జయబాబు, స్థానిక వార్డుల కౌన్సిలర్ సభ్యులు సువ్వాడ లావణ్య, మజ్జి శశికళలతో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్‌లు కోఆప్షన్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, స్టేట్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్యాన్ గాలి ప్రభంజనాన్ని ఆపలేరు

సీతానగరం: రాష్ట్రంలో వీస్తున్న ఫ్యాన్ గాలిని నిలువరించడం ఎవరికీ సాధ్యం కాదని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం మండలంలోని సుమిత్రాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగనన్నను రెండవ పర్యాయం ముఖ్యమంత్రిని చేయడానికి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతూ మండల నాయకులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, స్థానిక సర్పంచ్ బొత్స నందిని, వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్స ఉమామహేశ్వరరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో పార్టీకి సేవలందిస్తున్న నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: దివ్యాంగుని యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వీరతిలకం దిద్దుతున్నసుమిత్రా పురం గ్రామస్తులు

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమపథకాలు అందించిన జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమఫలాలు పొందుదామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం లక్ష్మీపురం కొత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన 2024 సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం మనందరిపై ఉందని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. గ్రామంలో సర్పంచ్ టి. సత్యవతి, ఎంపీటీసీ టి.పార్వతి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జరిగింది. కార్యక్రమంలో ఏపీటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సత్యవతి, చప్పసురేష్, ఉమారాము, అప్పారావు, గంగునాయుడు, టి. వెంకటరమణ పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: ఎన్నికలు సమర్థవంతంగా సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల పీఓ, ఏపీఓలకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతుల్లో మొదటిరోజైన శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరికి కేటాయించిన విధులు వారు నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటుచేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.

పాచిపెంటలో ఫ్లాగ్‌మార్చ్



పాచిపెంటలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

పాచిపెంట: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాచిపెంట ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలో విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలిసి శుక్రవారం పాచిపెంట మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అందరూ బాధ్యతగా నడుచుకోవాలని ఎస్సై ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి 21న పరీక్ష

మక్కువ: వచ్చే విద్యాసంవత్సరంలో మోడల్ స్కూల్‌లో ఆరవతరగతిలో విద్యార్థుల ప్రవేశానికి ఈనెల 21న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని ములక్కాయవలస మోడల్‌పాఠశాలలో ఆరవతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీ అయినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, ఈనెల 21న ఉదయం 10గంటలకు పాఠశాలలో నిర్వహించనున్న ప్రవేశపరీక్షకు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆటోయూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై నరసింహమూర్తి

మక్కువ: స్థానిక మజ్జిగౌరమ్మ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో మక్కువ ప్రధాన రహదారి వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఎస్సై పి.నరసింహమూర్తి చలివేంద్రాన్ని ప్రారంభించి, ప్రజలకు మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేసి, ప్రజల దాహార్తిని తీర్చడం ఆనందంగా ఉందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున సుదూర ప్రాంతాల నుంచి మక్కువ చేరుకున్న ప్రజలకు ఎంతో సంతృప్తినిస్తుందని చెప్పారు. ఆటో డ్రైవర్లందరికీ ఎస్సై నరసింహమూర్తి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మక్కువ, నంద, దుగ్గేరు రూట్లకు చెందిన ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

మక్కువ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాతంగా జరిపేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై పి.నరసింహమూర్తి కోరారు. ఈ మేరకు మండలంలోని కోన, గోపాలపురం, దబ్బగెడ్డ గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల నియమ, నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలకు తావివ్వకుండా ప్రజలు నడుచుకోవాలని హితవు పలికారు. బెల్ట్ షాపులు, సారా అమ్మకాలు, ఎన్నికలపై పందాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకోడ్ ఉల్లంఘించినా, గొడవలు సృష్టించినా చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ర్యాలీలు చేయరాదని, ఇళ్లపై పార్టీజెండాలు పెట్టరాదని చెప్పారు.

ఇంటర్మీడియట్‌లో కేజేబీవీ శతశాతం ఉత్తీర్ణత

- విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందనలు



శాంతికుమారి




వాసంతి

మక్కువ: మండలంలోని కాశీపట్నం కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేకాధికారిణి జి.నాగదుర్గ శుక్రవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు 35మంది రాయగా 35మంది, అలాగే ద్వితీయ సంవత్సరం పరిక్షలు 33మంది రాయగా, 33మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమసంవత్సరం బైపీసీ గ్రూపులో పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన ఆర్.శాంతికుమారి 440మార్కులకు 428 మార్కులు సాధించగా, ద్వితియ సంవత్సరం బైపీసీ గ్రూపులో మక్కువ మండలంలోని పాయకపాడు గ్రామానికి చెందిన కె.వాసంతి 1000మార్కులకు 944 సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన శాంతికుమారి, వాసంతిలను ప్రత్యేకధికారిణి నాగదుర్గ, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రభుత్వ కళాశాలకు జిల్లాలో ద్వితీయస్థానం

స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమసంవత్సరం విద్యార్థులు 155మంది పరీక్షలకు హాజరు కాగా, 144 మంది, ద్వితీయసంవత్సరం పరీక్షలు 151మంది రాయగా, 143మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డి.మంజులావీణ తెలిపారు. మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడిట్ విద్యార్థులు ఉత్తీర్ణతలో జిల్లాలో ద్వితీయస్థానం సాధించినట్లు చెప్పారు.


జోగింపేట స్కూల్ఆఫ్ ఎక్సలెన్స్‌లో శతశాతం..



ఎస్ ప్రమోద్ కుమార్ 955/1000)



కె అభిరామ్, 459/470.



ఎం జయకర్ 429/440)

సీతానగరం: మండలంలోని జోగింపేట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (స్కూల్ఆఫ్ఎక్సలెన్స్) విద్యాలయంలో ఇంటర్మీడియట్ పరిక్షా ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించగా, ఫస్టియర్‌లో 97.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు తెలియజేశారు. ఇంటర్మీడియట్ సెకెండియర్‌లో ఎంపీసీ గ్రూప్‌లో 45 మంది, బైపీసీ 39 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారని తెలియజేశారు. ఫస్టియర్ ఎంపీసీలో 43 మంది, పరీక్షల్లో పాల్గొనగా 41 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే బైపీసీలో 36 మంది పాల్గొనగా 36 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. ప్రతిభకనబర్చిన వారందరినీ ఆయన అభినందించారు.

ప్రభుత్వం జూనియర్ కాలేజీలో 77 శాతం

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ సెకెండియర్ పరీక్షాఫలితాల్లో 77 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారని ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు తెలియజేశారు. సెకెండియర్ జనరల్ గ్రూపుల్లో బైపీసీలో ఎ.స్వాతి 879/1000, ఒకేషనల్ గ్రూపులో (సీఈటీ) ఎఆఖిల్ 894 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో కిరణ్మయి. 407 మార్కులు, ఒకేషనల్ గ్రూపులో ఎంఅండ్‌టీ విద్యార్థి ఎ.సాయికుమార్ (ప్రథమ సంవత్సరం)461 మార్కులు సాధించినట్లు వివరించారు.

ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు

సాలూరు: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ కళాశాలలు మిశ్రమ ఫలితాలు సాధించాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 180 మంది పరీక్షలు రాయగా 50 మంది పాసై 27.78 % ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 149 మంది విద్యార్థులు పరీక్షలు రాసి 58 మంది పాసై 38.93 % శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే మండలంలోని పురోహితునివలస ఆదర్శ కళాశాలలో 27మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా 24 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 66 మంది రాయగా 56 మంది పాసై 76% ఉత్తీర్ణతా శాతం సాధించారు. పట్టణంలోని పీఎన్‌బొడ్డవలస గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 71 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఆశాజనకం

పాచిపెంట: మండలంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫలితాలు ఆశాజనకంగా వచ్చాయి. పి.కోనవలస గురుకుల బాలుర కళాశాల 77 శాతం, పి.కోనవలస గురుకుల బాలికల కళాశాల 86 శాతం, పాచిపెంట కేజీబీవీ 85 శాతం, పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల 71 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

స్వచ్ఛందంగా వలంటీర్ల రాజీనామా



సీతానగరం: కార్యదర్శులకు రాజీనామా పత్రాలు సమర్పించిన వలంటీర్లు



పాచిపెంట: రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు



పార్వతీపురం టౌన్: సచివాలయ సిబ్బందికి రాజీనామా పత్రం అందజేస్తున్న వలంటీర్

సీతానగరం:

మండలంలోని పెదంకలాం సచివాలయం పరిధిలో ఉన్న మూడు గ్రామాల వలంటీర్లు స్వచ్ఛందంగా తమ రాజీనామా పత్రాలను సచివాలయం కార్యదర్శి శ్రీనివాసరావుకు శుక్రవారం అందజేశారు. ఉన్నత చదువులు అభ్యసించినా స్వగ్రామంలో వలంటీర్లుగా సేవలందిస్తున్నందున వచ్చిన సంతృప్తి మరెక్కడా లేదని వారు భావించి విధుల్లో చేరామని వారు ఈ సందర్భంగా అన్నారు. వలంటీర్ వ్యవస్థను తెచ్చిన జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి, పార్వతీపురం ఎమ్మెల్యేగా అలజంగి జోగారావు విజయానికి తమవంతు సహకారాన్ని అందించడానికి గ్రామాల్లో ప్రచారం చేస్తామని రాజీనామా చేసిన వలంటీర్లు స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో ఎం.ప్రసాద్, వి.వేణుగోపాలరావు, బి.పార్వతి, ఎల్.దివ్య, వై ఉష, ఆర్.నాగేష్, జి పవన్‌కల్యాణ్‌తో పాటు మరో ముగ్గురు ఉన్నారు.

పార్వతీపురంలో 16 మంది...

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణం, మండలంలో 16 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు, మండలానికి చెందిన 14మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ సిబ్బందికి రాజీనామా పత్రాలను అందజేశారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు తెలియచేయడంలో ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు వలంటీర్లు తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి తెలియజేసి మళ్లీ రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగాలంటే అది జగనన్నతోనే సాధ్యమని, జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు, పార్వతీపురంలో ఎమ్మెల్యేగా జోగారావును గెలిపించాలన్న ఉద్దేశంతో స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను అందజేశామని వలంటీర్స్ చెప్పారు.

పాచిపెంటలో 23 మంది వలంటీర్లు..

పాచిపెంట: మండలంలోని పాంచాలి, కేసలి సచివాలయాల పరిధిలో 23 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను మండలపరిషత్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. వారి రాజీనామాలను ఎంపీడీఓ ఆమోదించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి తరపున నిలబడేందుకే తాము రాజీనామా చేశామని, ప్రచారం ముమ్మరం చేస్తామని తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

నర్సిపురంలో ఆరోగ్య సురక్ష



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర వైద్యసేవలందిస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డి

పార్వతీపురంటౌన్: వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎమ్.కె తిరుమలప్రసాద్ అధ్వర్యంలో నర్సిపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వారు హాజరు కాగా వారికి వైద్యులు ఆరోగ్య సేవలు అందించారు. వచ్చిన వారి సమస్యలు తెలుసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేసి కావలసిన మందులు ఇచ్చారు. ఈ శిబిరంలో ఎముకలు, చెవి, ముక్కు వైద్యులు, కంటికి సంబంధిచిన వారు అందుబాటులో ఉన్నారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు, శేషగిరిరావు ఎస్.కోటేశ్వర రావు, సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ, అమరావతి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షలో నేత్ర పరీక్షలు:

ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా నేత్ర వైద్య పరీక్షలను కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షించారు. కంటి వైద్య సహాయకురాలు ఉమామహేశ్వరి పరీక్షలు నిర్వహించి 3 గురుకి అంతర కుసుమం, ఇద్దరికి కొయ్య కండ, 18 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తామని, అలాగే దృష్టి దోషం ఉన్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని, సాధారణ వ్యాధులకు మందులతో చికిత్స అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కృష్ణవేణి,ఆది లక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్, జయ, నాగమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో జేఏఎస్-2 వైద్యశిబిరం



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నిహారిక

సీతానగరం: మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్-2) వైద్యశిబిరాలను వ్యాధిగ్రస్తులంతా వినియోగించుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ పి.నిహారిక కోరారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేట పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారికా మాట్లాడుతూ జేఏఎస్-1 లో గ్రామాల్లో దీర్ఘకాలంగా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధినిర్ధారించి, నివారణకు అవసరమైన మందులు నెలకు సరిపడా ఇచ్చినట్లు చెప్పారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 256 మందికి వైద్య సేవలందించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి మురళి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పెద ఊటగెడ్డకు తాగునీరు

- రంగునాయుడి ఔదార్యం



పెదఊటగెడ్డలో రంగునాయుడు సొంత నిధులతో ఏర్పాటుచేసిన మినీ రక్షిత మంచినీటి పథకం

మక్కువ: మండలంలోని పెదఊటగెడ్డ గ్రామానికి చెందిన గ్రామస్తులు కొంతకాలంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రక్షితమంచినీటిపథకం లేకపోవడం, బోరుబావులు ఉన్నప్పటికీ జనాభా అధికంగా ఉండటంతో పాటు, వేసవికాలం కావడంతో తాగునీరు చాలడంలేదు. గ్రామస్తులు ఇటీవల మండల పెద్ద మావుడి రంగునాయుడిని కలిసి, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సహాయం చేయాలని కోరారు. దీనికి ఆయన స్పందించి, తన సొంత నిధులు రూ.50వేలు వెచ్చించి, వాటర్‌ట్యాంక్‌తోపాటు, ట్యాంక్‌కు నీరందించే మోటార్‌ను గ్రామంలో ఏర్పాటుచేసి, గ్రామస్తుల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రంగునాయుడి ఔదార్యాన్ని గ్రామస్తులంతా మెచ్చుకుంటున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

జియ్యమ్మవలస: మండలంలోని 31 గ్రామపంచాయతీలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ బడే శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.